ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 20 ని. లు

## ముఖ్యాంశాలు

- కేంద్ర బడ్జెట్ లో విశాఖ స్టీల్ ప్లాంట్ కు 3 వేల 295 కోట్ల రూపాయలు, విశాఖ పోర్టుకు 730 కోట్ల రూపాయల నిధులు కేటాయించారు.

- ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన అందిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- సాంకేతికతను వినియోగిస్తూ.. నేరరహిత సమాజం దిశగా ప్రభుత్వం అడుగులేస్తోందని మంత్రి వంగలపూడి అనిత అన్నారు.

- శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

==========================

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 కేంద్ర బడ్జెట్ ను ఈరోజు పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ లో పోలవరం ప్రాజెక్టుతో పాటు, విశాఖ స్టీల్ ప్లాంట్, విశాఖ పోర్టుకు నిధులు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పోలవరం ప్రాజెక్టుకు 5 వేల 936 కోట్ల రూపాయలు, పోలవరం నిర్మాణానికి బ్యాలెన్స్ గ్రాంటుగా 12 వేల 157 కోట్లు కేటాయించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు 3 వేల 295 కోట్ల రూపాయలు, విశాఖ పోర్టుకు 730 కోట్ల రూపాయలు కేటాయించారు. రాష్ట్రంలోని ఆరోగ్య వ్యవస్థల బలోపేతానికి 162 కోట్లు, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కు 186 కోట్లు, లెర్నింగ్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆపరేషన్‌కు మద్దతుగా 375 కోట్లు, రోడ్లు, వంతెనల నిర్మాణానికి 240 కోట్లు, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, లైవ్లీ హుడ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు రెండవ దశకు 242.50 కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించినట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు.

==========================

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన మధ్యతరగతి ప్రజలకు బడ్జెట్ లో పన్ను మినహాయింపు మంచి పరిణామమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ను ఆయన స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వికసిత్ భారత్ దార్శనికతను బడ్జెట్ ప్రతిబింబిస్తోందన్నారు. ప్రజా అనుకూల ప్రగతిశీల బడ్జెట్‌ను ఈరోజు నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహిళలు, పేదలు, యువత, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చారన్నారు. రాబోయే ఐదేళ్లలో వృద్ధికి ఆరు కీలక రంగాలను బడ్జెట్ గుర్తించిందన్నారు. ఈ సందర్భంగా సామాజిక మధ్యమం వేదికగా కేంద్ర ప్రభుత్వానికి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

==========================

పార్లమెంట్ లో ఈరోజు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దేశప్రజల ఆశలకు అనుగుణంగా ప్రవేశపెట్టిన బడ్జెట్ ను స్వాగతిస్తున్నారు. రైతులు, విద్యార్థులు, సాంకేతిక రంగాలకు ఈ బడ్జెట్ లో అధిక ప్రాధాన్యతనిచ్చారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా, విద్యార్థి రాయపాటి జగదీష్ మాట్లాడుతూ... వైద్యవిద్యలో కొత్తగా 50 వేల సీట్లను అందుబాటులోనికి తీసుకురావడం ఎంతో సంతోషకరమన్నారు. పాఠశాల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్ లు ఏర్పాటు చేయడం హర్షణీయమని తెలుపుతూ...

(వాయిస్ 35 సెకన్లు)

పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ బడ్జెట్ ఎంతగానో ఆమోదయోగ్యంగా ఉందని తిరుపతి జిల్లాకు చెందిన న్యాయవాది అజయ్ కుమార్ పేర్కొన్నారు.

(వాయిస్ 33 సెకన్లు)

==========================

పర్యావరణానికి హితం చేకూర్చే సముద్ర జీవులను సంరక్షించుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. ఈరోజు భీమవరంలో అటవీ, మత్స్యశాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... చినమైనివానిలంక, పెద్దమైనివానిలంక తీర ప్రాంతానికి పదుల సంఖ్యలో చనిపోయిన తాబేళ్ళు కొట్టుకురావడం ఆందోళన కలిగించే అంశమని, ఈ విషయమై అటవీ, మత్స్య, పశుసంవర్ధక శాఖల అధికారులతో విచారణ బృందాన్ని నియమించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో బృందం పర్యటించి తాబేళ్ళు చనిపోవడానికి కారణాలను విశ్లేషించడంతో పాటు, ఇప్పటికే చనిపోయిన తాబేళ్లపై నివేదికను సమర్పించాలని ఆదేశించారు. సముద్ర తీర ప్రాంతానికి విఘాతం కలిగించే ఎటువంటి చర్యలకు పాల్పడిన ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

విరామం

==========================

ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన అందిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈరోజు అన్నమయ్య జిల్లా సంబేపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రస్తుతం గ్రామీణ యువతకు సైతం అత్యంత సులభతరంగా ఆదాయ వనరుగా మారిన "వర్క్ ఫ్రమ్ హోమ్" వలే "ఫ్రమ్ సైబర్ హోమ్"ను అమలులోకి తీసుకోస్తామని అన్నారు. అలాగే రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

===========================

ఈరోజు సాయంత్రం 6 గంటల 30 నిమిషాల నుండి 7 గంటల 45 నిమిషాల వరకూ బడ్జెట్‌పై ప్రత్యక్ష చర్చా కార్యక్రమం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం సమర్పణలో ప్రసారం కానుంది.

===========================

సాంకేతికతను వినియోగిస్తూ.. నేరరహిత సమాజం దిశగా ప్రభుత్వం అడుగులేస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈరోజు మంగళగిరిలో  పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 10 శాతం నేరాలు తగ్గాయన్నారు.  ఎక్కడికక్కడ డ్రోన్లు, సీసీ కెమెరాలను విరివిరిగా వినియోగిస్తూ.. నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. ఆడపిల్లల రక్షణకు కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యతనిస్తుందని, వారిపై దాడులు నివారించేందుకు అన్ని విధాల చర్యలు చేపడుతున్నామన్నారు. ఆడపిల్లపై జరుగుతున్న దాడులను ప్రతిపక్షాలు రాజకీయం చేయడం సబబు కాదని మంత్రి హితవుపలికారు.

===========================

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర దేవదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈనెల 21 నుంచి మార్చి 4వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై మంత్రి అనగాని ప్రసాద్, కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి ఆనం రామనారాయణరెడ్డి సమీక్షా నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

(వాయిస్ 38 సెకన్లు)

అలాగే రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ... శ్రీకాళహస్తి ఆలయంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించామని.. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులందరికీ అన్నపానీయాలను అందజేస్తామన్నారు.

===========================

అరకు పర్యాటకాన్ని ప్రపంచానికి  తెలియజేసే లక్ష్యంతో నిన్న ఘనంగా ప్రారంభమైన అరకు చలి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా ఈరోజు  బొర్రా గుహలు నుండి అరకు లోయ వరకు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ సైకిల్ రైడింగ్ నిర్వహించారు.

===========================
===========================